క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నేడు ఉదయం 11:00 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎండీ అప్జద్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పెందోర్ మోతిరాం అధ్యక్షతన జరిగే సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలులతో పాటు అధికారులు తమ ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

కోతకు గురైన రోడ్డు



కోతకు గురైన జోడేఘాట్‌కు వెళ్లే రోడ్డు

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌కు వెళ్లే రోడ్డు హట్టి గ్రామ సమీపంలో కోతకు గురైంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా గుంతలు పడ్డాయి. వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి గుంతలను మూసి వేయాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

నేడు చింతలమానెపల్లి వారసంత వేలం

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని వారసంతకు సోమవారం వేలం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో, ప్రత్యేకాధికారి కోట ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉదయం 11గంటలకు వారసంత 2024- 25 సంవత్సరాలకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ. 20వేల రూపాయలు డిపాజిట్‌గా చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

3న బెజ్జూర్..

బెజ్జూర్: మండల కేంద్రంలోని వారసంత వేలం పాటను ఈనెల 3న నిర్వహించనున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి తుకారాం తెలిపారు. ఆసక్తి గలవారు ధరావత్తు రూ.5 వేల డీడీ చెల్లించి పాల్గొనాలన్నారు. ఈ విషయాన్ని వేలంలో పాల్గొనేవారు గమనించాలని ఆయన కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కౌటాల: కౌటాల మండల కేంద్రంలోని విజేత హాస్పిటల్‌లో సోమవారం డాక్టర్స్ డే సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు విద్యాసాగర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తామన్నారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



నాయకులను సన్మానిస్తున్న అధికారి శంకర్

బేల: ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మండల ప్రత్యేకాధికారి శంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ రాక్రే వనిత గంభీర్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అంతకుముందు ఐకేపీ ఏపీఎం రాజారెడ్డి మాట్లాడుతూ.. మండలానికి రెండు మీ సేవకేంద్రాలు మంజూరయ్యాయని, మహిళ శక్తి సంఘాల సభ్యులతో ఏర్పాటు చేయిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు 90 శాతం యూనిఫారంలు అందించామన్నారు. రైతుల సౌకర్యార్థం వ్యవసాయ పనిముట్లను కస్టమ్ హైరింగ్ సెంటర్‌ను పద్మావతి మండల సమైఖ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. చివరగా ఈనెల 4న జెడ్పీటీసీ అక్షిత సతీష్‌పవార్, ఎంపీపీ, ఎంపీటీసీలు, మండల కోఆప్షన్‌సభ్యుడు తన్వీర్‌ఖాన్‌ల పదవీకాలం ముగుస్తుండడంతో ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో మహేందర్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి కొత్త చట్టాల అమలు

ఆదిలాబాద్‌టౌన్: బ్రిటీష్ కాలం నాటి ఐపీసీ, సీఆర్‌పీసీ, ఐఈఏ చట్టాలు కాలగర్భంలో కలిసిపోయినట్లేనని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి అన్నారు. జూలై 1 నుంచి కొత్త చట్టాలు అమలులోకి రానున్నట్లు తెలిపారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష, భారతీయ సాక్ష అధియాన్ కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయన్నారు. 150 ఏళ్ల క్రితం ఈ చట్టాలను రూపొందించడం జరిగిందని, మారిన కాలానుగుణంగా కొత్త చట్టాలు అమలులోకి రావడం జరిగిందని పేర్కొన్నారు. గత సైబర్ క్రైం, ఇతర నేరాలకు సంబంధించి చట్టాలు ఉండేవి కాదని, ప్రస్తుతం పెరిగిన టెక్నాలజీకి అనుగుణంగా నూతన చట్టాలు అమల్లోకి వస్తాయన్నారు.

సమస్యలు లేవనెత్తేదెవరు?

- ఎంపీటీసీలకు ఇదే చివరి సమావేశం
- ఈనెల 4తో ముగియనున్న పదవీకాలం
- తీర్మానాలకే సమావేశాలు పరిమితం
- నేడు మండల సర్వసభ్య సమావేశం



కెరమెరి ఎంపీడీవో కార్యాలయం

కెరమెరి: ఐదు సంవత్సరాలుగా ప్రజలకు సేవలు అందించిన ఎంపీటీసీలకు ఇదే చివరి మండల సమావేశం కానుంది. వారి పదవి కాలంలో ఎన్నో సమస్యలను నెరవేర్చినప్పటికీ ప్రధాన సమస్యలు అలాగే మూలుగుతున్నాయి. ఏళ్ల కాలంలో వాటి పరిష్కారం కోసం ఏ ప్రభుత్వం ముందుకు రావడం లేదు. మూడు నెలల తర్వాత నేడు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే మండల సభలో వివిధ సమస్యలు సభ దృష్టికి రానున్నాయి. గడిచిన కొన్నేళ్లుగా జరుగుతున్న సమావేశాలు నామమాత్రంగా కొనసాగాయి. ఇలా విని అలా అధికారులు పెడచెవిన పెడుతున్నారని, సమావేశాల వలన ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదని మండల వాసులు అంటున్నారు. కాగా చాలా కాలం తర్వాత సర్పంచులు లేకుండా మండలసభ నిర్వహిస్తుండండతో సమస్యల ప్రస్తావన వస్తాదా? రాదా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఇవి సమస్యలు..

ప్రతీ మూడు నెలకొసారి నిర్వహించాల్సిన మండల సభలు మొక్కుబడిగా కొనసాగుతున్నాయి. పారిశుధ్యం, వైద్యం, రవాణా, రోడ్డు సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఈనేపథ్యంలో నేడు జరుగే మండల సర్వసభ్య సమావేశంపై సభ్యులు వివిధ అంశాలపై నిలదీయనున్నారు. సభ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సమావేశంలో తమతమ శాఖలకు సంబంధించిన సమస్యలు వింటున్న అధికారులు ఆ తర్వాత వాటిపై తీసుకునే చర్యలు అంతంతే. మండలంలో 31 గ్రామ పంచాయతీలున్నాయి. అనేక గ్రామాల్లో రోడ్డు రవాణా సౌకర్యాలు లేక, మంచినీటి పథకాలు పని చేయక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

20 పడకల ఆసుపత్రి ఎక్కడ..

ప్రతీ మూడు నెలలకొసారి జరిగే సమావేశంలో కెరమెరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 20 పడకల ఆసుపత్రి చేయాలని చేస్తున్న తీర్మానం నేటికి ఎలాంటి పురోగతి సాధించలేదు. 'ఎక్కడ వేసిన గంగళి' అక్కడే అన్న చందంగా మారింది సరిపడా వైద్యాధికారులు లేక రోగులు తిప్పలు పడుతున్నారు. గ్రామాల్లో నర్సులు, సూపర్‌వైజర్లు తప్పా వైద్యాధికారులు సందర్శించరని ప్రజలు వాపోతున్నారు. చాలా చోట్ల ఏఎన్‌ఎంలు స్థానికంగా ఉండడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రజలకు సేవలందించాం



గడిచిన ఐదేళ్లుగా అన్ని వర్గాల ప్రజలకు సేవలందించాం. మరోమూడు రోజుల్లో పదవి కాలం ముగుస్తుంది. మండలంలోని శాశ్వత సమస్యలు ఎన్నో ఉన్నాయి. వాటికి నిధులు లేక పరిష్కారం చేయలేక పోయాం. ఉన్నాన్ని రోజులు ప్రజలు, అధికారుల సహకారంతో మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపించాం.

– పెందోర్ మోతిరాం, ఎంపీపీ, కెరమెరి

పట్టాపాస్ బుక్‌లు పునరుద్ధరించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

బెజ్జూర్: గతంలో ఇచ్చిన పట్టాపాస్ పాస్‌బుక్‌లను పునరుద్ధరించాలని మండలంలోని చిన్నసిద్దాపూర్ రైతులు కోరారు. కాగజ్‌నగర్ పట్టణంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వచ్చిన ఇన్‌చార్జి మంత్రి సీతక్కను 50 మంది రైతులు ఆదివారం కలిశారు. సిద్దాపూర్ గ్రామానికి చెందిన రైతులు 761, 762 సర్వే నెంబర్లు గత కొన్ని సంవత్సరాల కాలంగా కాస్తూ.. చేసుకున్న భూములకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినటువంటి పాస్ బుక్‌లు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటై భూప్రక్షాళన సర్వేలో పట్టాలు రాకుండా నిలిపివేసిన వాటిని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు చేతుల మీదుగా వినతిపత్రం అందజేశారు. కొత్త పాస్‌బుక్‌లకు అధికారులు రుణాలు ఇవ్వడం లేదని, రైతుబంధు, రైతు బీమా వంటి ప్రభుత్వ పథకాలకు నోచుకోకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నీకూరి రమేష్, సామల శ్రీనివాస్, నికూరి నారాయణ, కృష్ణ, కుట్రంగి బిక్షపతి, మొండి మలుమేర శంకర్, శ్రీశైలం, భీంరావు, పండు మేర వెంకటేష్, కమలాబాయి నానబాయి, సంతర్ బాయ్ పాల్గొన్నారు.

తుప్పు పడుతున్న మంచాలు



పాఠశాల ఆవరణలో మంచాలు

నార్నూర్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో చదివే గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నా.. అధికారుల నిర్లక్ష్యంతో అవి దరి చేరడం లేదు. ఆశ్రమ పాఠశాలలో చదివే విద్యార్థులకు గత ఐదేళ్ల క్రితం డెస్కుతో పాటు మంచాలను పంపిణీ చేశారు. అయితే కొన్ని పాఠశాలలో సరిపడ గదులు లేక ఆరుబయటే పెట్టడంతో వర్షానికి తడిసి తుప్పుపడుతున్నాయి. అయినా.. సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఒక్క ఉన్నత ఆశయంతో ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి సౌకర్యాలు సమకూర్చితే ఇలా వృథా చేయడం సరికాదని గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు స్పందించి ఆరుబయట ఉన్న మంచాలను తప్పుపట్టకుండా చూడాలని కోరుతున్నారు.

మంత్రికి వినతుల వెల్లువ



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్‌లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ఆదివారం వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు పలు సంఘాల నాయకులు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలు సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంత్రికి విన్నవించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కూశన రాజన్న మాట్లాడుతూ ప్రతీ సీజన్‌లో ఆకు సేకరణ ద్వారా 30 వేల మంది ఉపాధి పొందుతున్నారని, వీరికి కట్ట డబ్బులతో పాటు బోనస్ కూడా వస్తుందన్నారు. ఇంకా 6300 మందికి బోనస్ చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో కోట శ్రీనివాస్, ముంజం ఆనంద్‌కుమార్, అంగల శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో...

సమస్యలను పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్‌లు మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ పూర్తి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. 317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను డీఎస్సీ నియామకాల కంటే ముందే వారి సొంత జిల్లాలకు పంపించాలన్నారు. ఆశ్రమ పాఠశాలలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు..

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మంత్రి సీతక్కకు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్మికులకు బకాయి పడ్డ పీఎఫ్‌ను కార్మికుల ఖాతాలో జమ చేయాలని, అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న ఎస్‌ఎంఆర్ కార్మికుల మూడు నెలలు, పారిశుధ్య కార్మికులకు రెండు నెలల జీతాలు ఇవ్వాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంజీవ్, శంకర్, మల్లేశ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలి

ఐటీఐ, పాలిటెక్నిక్, అగ్రికల్చర్ డిప్లొమా కళాశాలలను ఏర్పాటు చేయాలని నిరుద్యోగ జేఏసీ జిల్లా కన్వీనర్ పొన్న రమేశ్, నాయకులు ఎన్నం శ్రీకాంత్, ముజామిలుద్దీన్ అహ్మద్ కోరారు. సాంకేతిక విద్యాసంస్థలు లేని కారణంగా కరీంనగర్, హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు.

జిల్లా ఆసుపత్రిలో వైద్యులను నియమించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రి రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గం దినకర్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. వైద్యులు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారని, ప్రైవేట్‌లో రూ. లక్షలు చెల్లించుకోలేక ఆస్తులను అమ్ముకోవాల్సి వస్తుందన్నారు. ఆసుపత్రిలో స్కానింగ్ సెంటర్‌ను ప్రారంభించా లని కోరారు. కార్యక్రమంలో రాజేందర్, పాల్గొన్నారు.

తీరనున్న ఎర్రగుట్ట కష్టాలు

- శరవేగంగా వంతెన నిర్మాణ పనులు
- గ్రామానికి పూర్తయిన బీటీరోడ్డు
- గ్రామస్తులకు తీరనున్న ఇక్కట్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



చివరిదశకు చేరుకున్న వంతెన పనులు

పెంచికల్‌పేట్: మండలంలోని గిరిజన గ్రామం ఎర్రగుట్ట వాసుల దశాబ్దాల కళ నెరవేరనుంది. వానాకాలం వచ్చిందంటే చాలు ఉచ్చమల్లవాగు ఉప్పొంగి గ్రామస్తులకు బాహ్య ప్రపంచానికి సంబంధాలు తెగిపోయేవి. దీంతో గత ప్రభుత్వం ఎర్రగుట్ట గ్రామానికి రోడ్డు, లోలెవల్ వంతెన నిర్మాణానికి సుమారు రూ. 2.50 కోట్లను విడుదల చేయడంతో అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గ్రామస్తులతో కలిసి కొబ్బరి కాయకొట్టి వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మూడు నెలలుగా కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇప్పటికే గ్రామానికి బీటీరోడ్డు పూర్తికాగా వంతెనపైన సీసీ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరో వారం రోజుల్లో పనులు పూర్తికానున్న నేపథ్యంలో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాలినడకే శరణ్యం..

వర్షాకాలంలో ఉచ్చమల్లవాగు వరదలతో ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో అనేక ఇబ్బందులు పడ్డారు. వైద్యం కోసం ప్రాణాలను ఆరచేతిలో పెట్టుకుని కాలినడకన అటవీ ప్రాంతం గుండా ప్రయాణించి ప్రధాన రహదారికి చేరుకోవాల్సి వచ్చేది. గ్రామంలోని లబ్ధిదారులు పింఛను కోసం వాగును దాటి సుమారు మూడు కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించి బొంబాయిగూడ గ్రామానికి రావాల్సి వచ్చేది. దీంతో వర్షాకాలంలో పడిన కష్టాలు వంతెన, రోడ్డు నిర్మాణంతో తీరిపోయాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వర్షాకాలంలో ఇబ్బంది



ఉచ్చమల్లవాగుపైన వంతెన లేక వర్షాకాలం వాగు ఉప్పొంగి బ్యాహ్య ప్రపంచానికి సంబంధాలు తెగిపోయేవి. అత్యవసర పరిస్థితుల్లో వరద నీటిలో ప్రయాణించి ప్రధాన రహదారికి చేరుకునే వాళ్లం. ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులను మంజూరు చేయడంతో పనులను శరవేగంగా సాగుతున్నాయి.

– ప్రభాస్, ఎర్రగుట్ట

ఆనందంగా ఉంది



మారుమూల గిరిజన గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి వంతెన, బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులను మంజూరు చేయడంతో పాటు సకాలంలో పనులు పూర్తి చేయడం ఆనందంగా ఉంది. గ్రామానికి నూతనంగా బీటీ రోడ్డు పూర్తి అయింది. మరో వారంరోజుల్లో వంతెన పనులు పూర్తి కానున్నాయి.

– రాకేశ్, ఎర్రగుట్ట

చినుకు పడితే చీకటే..



వాంకిడి సబ్‌స్టేషన్

- రాత్రి, పగలు గంటల తరబడి కోతలు
- తీవ్ర ఇబ్బంది పడుతున్న మండలవాసులు

వాంకిడి: మండలంలో విద్యుత్ సమస్య ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది. మే నెలాఖరు నుంచి విద్యుత్‌లో అంతరాయం ఏర్పడుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా.. గాలులు వీచినా.. కరెంట్ ఉండడం లేదు. మండలంలోని అనేక గ్రామాల్లో విద్యుత్ తీగలు పొదలను అలుముకుని ప్రమాదకరంగా ఉన్నాయి. మరికొన్ని చోట్ల తీగ మధ్యలోంచి చెట్ల కొమ్మలు ఎగబాకి ఉన్నాయి. ఈదురు గాలులు వీచినప్పుడు చెట్ల కొమ్మలు తగిలి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. రాత్రి సమయంలో ఏదైనా సమస్య ఏర్పడితే రాత్రింతా జాగారం ఉండాల్సిందే.

విసుగొచ్చేలా..

ప్రస్తుతమున్న పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా అంతరాయానికి మండల ప్రజలు విసుగు చెందుతున్నారు. విద్యుత్ సరఫరాలో జరిగే అంతరాయానికి వాతావరణంలో మార్పులే అని అధికారులు చెబుతున్నాప్పటికీ మరీ ఇంతలా విసుగు తెప్పించేలా అంతరాయమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా చర్యలు ఎందుకు చేపట్టడం లేదని మండిపడుతున్నారు. గంటల తరబడి కోతలు విధించడం సరికాదంటున్నారు.

మండలంలో రెండు సబ్‌స్టేషన్లు..

మండలంలో రెండు 33/11 కేవీ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు సరిగ్గా లేని కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంది. స్తంభాల మధ్య దూరం ఎక్కువ ఉండడంతో కిందకు తీగలు వేలా డుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు అవసరం ఉండగా.. కొత్తవాటిని ఏర్పాటు చేయడం లేదు. అయితే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాట్ల పనులు జరుగుతున్నాయని చెబుతున్నారు. వాటి ఏర్పాటుకు స్థలం సమస్యగా మారుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చూడాలని కోరుతున్నారు.



బంబార గ్రామంలో స్తంభానికి అల్లుకున్న తీగలు

అప్రకటిత కోతలతో ఇబ్బంది

మండల కేంద్రంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉంది. ఎప్పుడు వసాదో? ఎప్పుడు పోతాదో తెలియని పరిస్థితి. నిలకడ లేని కరెంట్‌తో విసుగు వస్తుంది. కొన్ని సందర్భాల్లో అప్రకటిత కోతలు విధిస్తున్నారు. గంటల తరబడి కరెంట్ లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అధికారులకు ఫోన్ చేసినా.. స్పందించేవారు కరువయ్యారు.

– దుర్గం దక్షిత్, వాంకిడి

పెరిగిన దోమల బెడద

రాత్రుల్లో కరెంట్ పోతే దోమలతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో దోమల బెడద ఎక్కువయ్యింది. కరెంటు పోతే గంటల తరబడి కూడా రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– మనోజ్‌కుమార్, వాంకిడి

టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌రావు



మల్రాజు శ్రీనివాస్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడిగా మరోసారి మ ల్రాజు శ్రీనివాస్‌రావు ఎంపికయ్యారు. ఈ మేరకు టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి ఆదేశాలు జారీ చేశా రు. ఏరియా ఉపాధ్యక్షుడిగా శ్రీనివా స్‌రావు నాలుగోసారి ఎంపికయ్యారు. అలాగే యూనియన్ రాష్ట్ర కమిటీలో ఏరియా నుంచి ముగ్గురికి స్థానం కల్పించారు. సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడిగా ధారావత్ మంగీలాల్, సెంట్రల్ కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అనుముల సత్యనారాయణ, సెంట్రల్ కమిటీ సభ్యుడిగా ఓరం కిరణ్‌లకు అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఏరియాలోని కా ర్మికుల హక్కుల కోసం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. కార్మికుల హక్కుల రక్షణ ధ్యేయంగా టీబీజీకేఎస్ పని చేస్తుందన్నారు.

నేడు నల్లబ్యాడ్జీలతో నిరసన..

రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులను వేలం వేయకుండా నామినేషన్ పద్ధతిలో సింగరేణికే అప్పగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏరియాలోని అన్ని గనులు, డిపార్టుమెంట్లలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీల నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు తెలిపారు. నిరసన కార్యక్రమం అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు.